# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

## THE WORD OF TRUTH



**July 1995**

# సంక్షిప్త వార్తలు

జూన్ నెల సువార్తికుల సదస్సు కొత్తపేట మండలం లక్ష్మీ పోలవరం గ్రామములో 21వ తేదీనాడు జరిగెను. ఆ రోజు ఉదయం వర్షాతీతమైనను అనేక మంది సువార్తికులు సమావేశమై "బాప్తిస్మ మనగా నేమి? రక్షింపబడుటకు బాప్తిస్మము అవసరమా?" అను అంశమును చర్చించిరి.

సకాలమునకు ప్రారంభమైన ఉదయకాల సమావేశమునకు సోదరులు డి. ఇశ్రాయేలురాజుగారు అధ్యక్షత వహించి సమర్థవంతముగా నడిపించిరి. సోదరులు డి. అబ్రహాముగారు ప్రార్థన చేయగా సోదరులు N. మోజెస్, డి. అబ్రహాము, డి. శ్రీరాములు మరియు పాల్ గూటంగార్లు ఇయ్యబడిన అంశమును కూలంకషముగా వివరించి చర్చించిరి. మధ్యాహ్న కాల సమావేశమునకు సోదరులు పి.జె. కృపా లిసీగారు అధ్యక్షత వహించగా, సోదరులు జి. షడ్రిక్ గారి ప్రార్థన వలన ఆరంభించబడెను. మధ్యాహ్న కాల సమావేశములో సోదరులు జి. షడ్రిక్, కె. కొర్నేలియస్, పి.యస్.ఆర్. జైపాల్, యస్.జె. మోహనరావ్, మరియు జాషువాగూటంగారు పై అంశమును చక్కగా వివరించి చర్చించిరి.

బాప్టిజో అను గ్రీకు పదమునుండి బాప్తిస్మమను మాట ఉద్భవించినది. బాప్తిస్మ మనగా నీటిలో ముంచుట లేక పాతిపెట్టుట యని అర్థము. క్రొత్తనిబంధనలో బాప్తిస్మ మిచ్చు యోహానుతో యిది ఆరంభమాయెను. అతను యేసుప్రభువు మార్గమును సరాళము చేయుచు ప్రజలకు మారుమనస్సు నిమిత్తమైన బాప్తిస్మ మిచ్చుచుండెను. "సలీము దగ్గరనున్న ఐనోనను స్థలమున నీళ్ళు విస్తారముగా ఉండెను గనుక యోహానుకూడ అక్కడ బాప్తిస్మ మిచ్చుచుండెను. జనులు వచ్చి బాప్తిస్మము పొందిరి" (యోహాను 3:23). యేసుక్రీస్తు కూడ యోహానుచే నీటిలో ముంచడము పొందెను. నీతి యావత్తు

[తరువాయి టైటిలు మూడవ పేజీలో]

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Phone ; 0884-73722

Editor : J.C. CHOATE

Managing Editor : JOSHUA GOOTAM

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 15 జూలై 1995 సంచిక 12

## సంపాదకీయం

## సంఘములో స్త్రీ పాత్ర

### ( Woman's Role in the Church )

స్త్రీల హక్కులను గూర్చి నేటి ప్రపంచములో గొప్ప నినాదాలు వినబడుచున్నవి. రాజకీయముగను, సాంఘికముగను, మత సంబంధముగను పురుషులతో బాటు స్త్రీలకు కూడ వృత్తి వేతనాలలో సమాన హక్కులు కల్పించబడాలనే పిలుపు వినబడుచున్నది. కొన్ని దేశాలలో స్త్రీలు బొత్తిగా అణగద్రొక్కబడి యున్నారు. వారు వస్తువులుగను, బానిసలుగను పరిగణింపబడుచు, బహిరంగముగా కనబడ కూడదని ముసుగుచాటున మసలవలెనని చెప్పబడుచుయున్న సమాజములు నేటికిని యున్నవి. యిట్టి పరిస్థితులు సరిదిద్దబడవలెను. అయితే కొన్ని పాశ్చాత్య దేశాలలో స్త్రీలు సమానత్వానికి గాక పురుషుని

కంటె హెచ్చుస్థాయి కావాలని కోరుకొనుచు పురుషులతో పోటీపడుచున్నారు.

మత సంబంధముగ కూడ గత కొద్ది సంవత్సరాలుగా స్త్రీ యొక్క పాత్ర గణనీయముగ మార్చబడినది. కొన్ని మతశాఖలవారు తమ సంఘాలలో స్త్రీ బోధకులను ఎప్పుడో ఏర్పాటు చేసికొన్నారు. మరి కొన్ని శాఖలవారు స్త్రీలను బిషప్పులుగాను, పాదిరులుగను, రెవరెండ్లుగను నియమించుకొని యున్నారు. మత లోకంలో ఇట్టి మార్పులు సంభవించుచున్నప్పుడు క్రీస్తు సంఘముయొక్క పరిస్థితి ఎట్లుండాలి? మనం లోకాన్ని అనుసరించుచు సంఘములో స్త్రీ బోధించుటకు, పాటలు పాడి నడిపించుటకు, ప్రార్థనలు చేయుటకు, ప్రభురాత్రి భోజన కార్యక్రమమును చేయుటకు అంగీకరించెదమా?— స్త్రీలను సంఘములో పెద్దలుగను పరిచారకులుగను నియమించెదమా? ఇట్టి విషయాల్లో లోకమంతా ఎట్లు నడుచుకొనుచున్నది యనికాదు గాని, దేవుని చిత్తమెట్లున్నది యని మనం తెలిసికోవాలి.

యిట్టి సంగతులను నిర్ణయించడానికి మనకు భూసంబంధ నాయకుడెవరు లేడు. సరిగదా ఏదో ఒక బోధకుడు లేక సంఘ పెద్ద సంఘ మంతటికొరకు నిర్ణయించలేడు. గనుక మనం దేవుని వాక్యము నొద్దకు వెళ్లాలి. దేవుడు ఆదిలో మానవుని స్త్రీనిగాను పురుషునిగాను సృజించెనని జ్ఞాపకముంచుకోవాలి. ఒకరు లేకుండా మరొకరు సంపూర్ణులు కాజాలరు. ఒకరికి మరొకరు అవసరం. సరిగదా దేవుడే పురుషుని స్త్రీకి శిరస్సుగా నియమించెను, మరియు అతనికి సాటియైన సహాయముగా స్త్రీని ఆయన సృజించెను. అంటే పురుషుడొక నియంత వలె, ఆమె యెడల క్రూరముగ ప్రవర్తించాలని దాని యర్థము కాదు. అయితే స్త్రీ బలహీన ఘటమని, పురుషుడు బలమైనవాడని అతడు

కుటుంబమునకును స్త్రీకిని యజమాని యని దీని యర్థము. యిది ఆది నుండి నేటికిని దేవుని సంకల్పమై యున్నది.

యేసుక్రీస్తు తనకొరకు 12 మంది అపొస్తలుల నేర్పరచుకొనెను. వారిలో ఒకతెకూడ స్త్రీ లేదు. ఎందువలన? దేవుడు పురుషునిచేసి అతనికి కొన్ని విధులను బాధ్యతలను అప్పగించెను. అట్లే ఆయన స్త్రీని చేసి ఆమెకు కొన్ని విధులను బాధ్యతలను అప్పగించెను. పురుషుడు కుటుంబ యజమానియై యుండగా స్త్రీ బిడ్డలను కని గృహ సంబంధమైన విధులను నిర్వర్తించవలెనని దేవుని సంకల్పమైయున్నది. ఆ స్థానములో ఆమెకు గొప్ప శక్తి ఈయబడినది. ఏలయనగా భావి ప్రపంచ నాయకులైన తన పిల్లలకు ఆమె తర్ఫీదు యిచ్చు స్థానములో యున్నది.

మరల, సర్వలోకమునకు సువార్త ప్రకటింపుడనే ఆజ్ఞను దేవుడు అపొస్తలులకు, పురుషులకు యిచ్చాడు. తరువాత వారి పనిలో సహాకరించుటకుగాను అపొస్తలులు ఏడుగురు పురుషులను ఏర్పాటు చేసికొనిరి. సంఘము అభివృద్ధి జెందుచుండగా స్థానిక సంఘములో నాయకులుగా పెద్దలు పరిచారకులుగా యుండుటకు పురుషులు ఏర్పాటు చేయబడిరి (1 తిమోతి 3, తీతు 1).

అయితే అపొస్తలులుగను, బోధకులుగను, పెద్దలు పరిచారకులుగను స్త్రీలను క్రీస్తు పరిశుద్ధాత్ముడు, అపొస్తలులు కూడ ఎందుకు ఏర్పాటు చేసికోలేదు. స్త్రీలు తక్కువవారా? వారికి ప్రాముఖ్యత లేదా? ఈ పనులు నిర్వర్తించు సామర్థ్యము వారికి లేదా? అట్లు కానే కాదు. అయితే ఈ పనులన్నిటిని దేవుడే నిర్దేశించాడని అట్లు చేయుటలో ఆయన సదుద్దేశమునే కలిగి యుండెనని మనం గ్రహించాలి. దేవుడు పురుషుని ఎట్లు చేసెనో స్త్రీనికూడ అట్లే చేసెను గాని

వారి తత్వాలు వేర్వేరుగ చేసెను, మరియు పురుషుని స్త్రీకి శిరస్సుగా జేసెను.

1 తిమోతి 2 : 13, 14లో ఇట్లున్నది : "మొదట ఆదాముని తరువాత హవ్వయును నిర్మింపబడిరి కారా? మరియు ఆదాము మోస పరచబడలేదు గాని, స్త్రీ మోసపరచబడి అపరాధములో పడెను". స్త్రీపై పురుషునికి ఈ రెండు కారణముల వలన దేవుడు అధిపత్యము ననుగ్రహించెను. అల్లే సంఘములో బహిరంగ నాయకత్వపు స్థానాన్ని దేవుడు పురుషునికే అనుగ్రహించెను. అయితే సంఘములో స్త్రీయొక్క పాత్ర యేమిటి? ఆమె తన భర్తకు సహాయము చేయుటకు, యితర సోదరీలతో పనిచేయుటకు, స్త్రీలు మరియు చిన్న పిల్లలకు ఉపదేశించుటకు, వ్యక్తిగత సేవ చేయుటకు, మరియు స్త్రీలు చేయ దగిన అట్టి పనులన్నియు చేయుటకు ఆమెకు తరుణము కలదు.

అయితే దేవుడు సంఘములో పురుషునికొరకు నియమించిన పనులను స్త్రీ చేయుట మొదలిడుసరికి, కొంత కాలానికి పురుషుని పాత్రయే సంపూర్తిగ ఆమె చేయుటకు మొదలిడును. యిది అనేక మతశాఖలలో నేడు జరుగుచున్న పనియై యున్నది. ఏలయనగా ఈ విధముగా స్త్రీ ముందుకు చొరబడునప్పుడు పురుషుడు దేవుడు తన కొరకు నిర్దేశించిన స్థానం నుండి విరమించుకొనును. తత్ఫలితముగా సంఘములో స్త్రీ పురుషుల స్థానం తారుమారగును. నిజానికి పురుషుడు తన పనిని, స్త్రీ తన పనిని నిర్వర్తించినయెడల వారికి బోలెడన్ని బాధ్యతలున్నవి. దేవునిని ఆయన చిత్తమును గౌరవించువారు దాని నంగీకరింతురు, గౌరవించనివారు ఆయన నెదిరింతురు.

సంఘము కూడి వచ్చినప్పుడు, "స్త్రీలు సంఘములలో మౌనముగా ఉండవలెను; వారు లోబడి యుండవలసినదేగాని, మాటలాడుటకు వారికి సెలవులేదు". "స్త్రీలు మౌనముగా ఉండి సంపూర్ణ విధే

యతతో నేర్చుకొనవలెను. స్త్రీ మౌనముగా ఉండవలసినదేగాని ఉపదేశించుటకైనను పురుషునిమీద అధికారము చేయుటకైనను ఆమెకు సెలవియ్యను" అని అపో. పౌలు పరిశుద్ధాత్మని పలుకులు లిఖించాడు (1 కొరింథీ 14:34; 1 తిమోతి 2:11, 12).

గనుక ఈ అంశముపై క్రీస్తు సంఘస్థులు దేవుని ఉపదేశము చొప్పున నడుచుకోవాలి. లోకస్థులు, మతశాఖలవారు ఏమి అనుకొన్నా, ఆదినుండి దేవుడు స్త్రీ పురుషుల పాత్రల నెట్లు నిర్దేశించాడో అట్లే మనం కొనసాగించాలి. అట్లు చేయడంలో మనం పురోగమిస్తామే గాని తిరోగించము. ఏలయనగా, "నా తలంపులు మీ తలంపులవంటివి కావు, మీ త్రోవలు నా త్రోవలవంటివి కావు. ఇదే యెహోవా వాక్కు. ఆకాశములు భూమికి పైన ఎంత యెత్తుగా ఉన్నవో, మీ మార్గములకంటె నా మార్గములు, మీ తలంపులకంటె నా తలంపులు అంత ఎత్తుగా ఉన్నవి" అని మన దేవుడు చెప్పుచున్నాడు (యెషయా ౫౫:8, 9).

— o —

## క్రీస్తు మంద

## (Christ's Flock)

"ఈ దొడ్డివికాని వేరే గొర్రెలును నాకు కలవు. వాటిని కూడ నేను తోడుకొని రావలెను. అవి నా స్వరము వినును. అప్పుడు మంద ఒక్కటియు గొర్రెల కాపరి ఒక్కడును అగును" (యోహాను 10:16). "పరిశుద్ధాత్మ మిమ్మును దేనియందు అధ్యక్షులనుగా ఉంచెనో ఆ యావత్తు మందను గూర్చియు, మీమట్టుకు మిమ్మును గూర్చియు జాగ్రత్తగా ఉండుడి" (అపో.కా. 20:28).

యేసు తనయొక్క అనుచరులను ఒక మందగాను, తాను ఒక గొర్రెల కాపరిగాను చిత్రీకరించారు. సంఘాన్ని ఆయన మందగా

ఆలోచించునప్పుడు ఆయన తన సంఘమున కేమిచేసెనో దాన్ని మనం అవగాహన చేసికొనవచ్చును. అందువలన ఆయన మందయైన సంఘముతో క్రీస్తుకుగల సంబంధము యెట్టిది? అని మనం అడుగవచ్చును.

## సంఘమునకు క్రీస్తు ప్రభువైయున్నాడు

ఈ వర్ణనలో మనకు గ్రాహ్యమయ్యే మొదటి సత్యం - క్రీస్తు సంఘమునకు ప్రభువైయున్నాడు! కాపరియైన క్రీస్తే గొర్రెలయొక్క యజమాని. ఆ మందను పాలించు ఏకైక పాలకుడు ఆయన ఒక్కడే. ఆ మందలోనికి ప్రవేశించువాడెవడైనను క్రీస్తుయొక్క సొత్తగును. అంటే గొర్రెలు ఆయన కొరకు జీవించును అను భావము ఇందులో యున్నది. మనము క్రీస్తుకు చెందినవారము గనుక ఆయన సేవకులము (ఫిలిప్పీ 1:1). రెండవదిగా, కాపరి కూడ గొర్రెలకొరకు జీవించునను భావము అందులో యున్నది. గొర్రెల యజమానివలె, కాపరి గొర్రెలను ప్రేమించును, వాటికొరకు బాధ్యత వహించును, వాటిని పోషించును. మంచి కాపరి ఈ బరువైన బాధ్యతలను నెరవేర్చును.

దేవుని సర్వశక్తిగల కుమారుడైన క్రీస్తు తనవారి యొక్క యోగక్షేమము లన్నిటిని తప్పక సమకూర్చును. దావీదు వ్రాసిన కృతజ్ఞత కీర్తనలో భౌతిక సంబంధమైన దీవెన లన్నిటికొరకు కృతజ్ఞత చెల్లించాడు; "నేను చిన్నవాడనై యుంటిని; ఇప్పుడు ముసలివాడనై యున్నాను. అయినను నీతిమంతులు విడువబడుటగాని; వారి సంతానము భిక్షమెత్తుటగాని నేను చూచియుండలేదు" (కీర్తన 37:25). యేసు కొండమీద చేసిన ప్రసంగములో తన శిష్యులను ఏమి తిందుమో, యేమి త్రాగుదుమో, యేమి ధరించుకొందుమో యని చింతించవద్దని హెచ్చరించెను (మత్తయి 6:31). "దొంగ దొంగతనము హత్యను నాశనమును చేయుటకు వచ్చునుగాని మరి దేనికిని రాడు; గొర్రెలకు జీవము కలుగుటకును, అది సమృద్ధిగా కలుగుటకును

నేను వచ్చితిననీ" యేసు చెప్పెను (యోహాను 10:10). మన మంచి గొర్రెల కాపరి మనలను తన సొత్తుగా కలిగియున్నాడు మరియు మన భౌతిక, ఆత్మీయ అవసరములను ఆయన తీర్చును.

క్రీస్తు మనలను కలిగియున్నాడంటే ఆయన మన సంరక్షకుడై యున్నాడు. గనుక మనము చింతింపవలసిన పని యేమున్నది? భయపడవలసిన పని యేమున్నది? నిన్ను కాయుచున్న మంచి గొర్రెల కాపరియందు విశ్వాసముంచుము. మన ప్రభువైన యేసును వెంబడించుటయే మన విధి. తదుపరి సమస్తమును ఆయన చూచుకొనును.

## క్రీస్తు సంఘమును నడిపించును

క్రీస్తు మంచి గొర్రెల కాపరి యనే వర్ణనలో ఆయన తన సంఘమును నడిపించును అని మనకు జ్ఞాపకం చేయును. గొర్రెల కాపరిని గొర్రెలు ఎట్లు వెంబడించునో అట్లే సంఘము క్రీస్తును వెంబడించును. మనమాయన స్వరమును విందుము, వెంబడింతుము. యేసు ఇట్లు చెప్పెను: "గొర్రెల దొడ్డిలో ద్వారమున ప్రవేశింపక వేరొక మార్గమున ఎక్కువాడు దొంగయు దోచుకొనువాడునై యున్నాడు. ద్వారమున ప్రవేశించువాడు గొర్రెల కాపరి. అతనికి ద్వారపాలకుడు తలుపు తీయును, గొర్రెలు అతని స్వరము వినును, అతడు తన సొంత గొర్రెలను పేరుపెట్టి పిలిచి వాటిని వెలుపలికి నడిపించును" (యోహాను 10:1-3).

ప్రతి రాత్రి గొర్రెల కాపరి గొర్రెలను దొడ్డిలోనికి నడిపించును. దానికి ఒకేఒక్క ద్వారముండును. ఆ ద్వారము దగ్గర రాత్రింతయు ద్వారపాలకుడొకడు ఉంచబడును. ఉదయమున కాపరి రాగా ద్వారపాలకుడు అతని గుర్తించును. అతనికి అతడు ద్వారము తెరువగా అతడు తన గొర్రెలను పిలిచి బయటికి నడిపించును. అయితే

దొంగ అయినవాడు గోడ దూకి లోపలికి ప్రవేశింపవలసి వచ్చును. ద్వారపాలకుడు అతని ఎరుగడు గనుక దొడ్డిలోనికి అతనికి ప్రవేశము కుదరదు.

యేసు ఇంకా ఇట్లు చెప్పెను: "మరియు అతడు తన సొంత గొర్రె లన్నింటిని వెలుపలికి నడిపించునప్పుడెల్ల వాటికి ముందుగా నడుచును; గొర్రెలు అతని స్వరమెరుగును గనుక అవి అతనిని వెంబడించును. అన్యుల స్వరము అవి ఎరుగవు గనుక అన్యుని ఎంత మాత్రము వెంబడింపక వానియొద్దనుండి పారిపోవును" (యోహాను 10:4, 5). గొర్రెలు దొడ్డిలోనుండి బయటికి వచ్చునప్పుడు కాపరి యొక్క పరిరక్షణ తప్ప వాటికి వేరొక భద్రత యుండదు. పచ్చిక యున్న చోటుకు నడిపించుటకు, నిర్భయముగా మేతమేయుటకు గొర్రెలు కేవలం కాపరిమీదనే ఆధారపడియుండును.

గొర్రెల కాపరి తన గొర్రెలయొక్క ఏకైక యజమాని. అతడు ఎక్కడకు నడిపించినను, గొర్రెలు అక్కడికి వెళ్లును. జంతువు లన్నిటికంటె గొర్రెలు వెంబడించు లక్షణముగలవి. ఎక్కడికి వెళ్ళవలెనో అవి నిర్ణయించుకోలేవు. గనుక ప్రమాదములో పడే అవకాశములు మెండు. అయితే సరియైన మార్గదర్శి యున్న యెడల అవి సరదాగా కాలము గడుపుచు మేతమేయుచుండును. ఈ విషయంలో మనము గొర్రెలవలె యున్నాము. నాయకుడు లేనియెడల గుడ్డివారివలె మార్గము కొరకు వెదుకుచుందుము. యిర్మియా ఇట్లు వ్రాసెను: "యెహోవా, తమ మార్గము నేర్పరచుకొనుట నరులవశములో లేదనియు మనుష్యులు తమ ప్రవర్తనయందు సన్మార్గమున ప్రవర్తించుట వారి వశములో లేదనియు నేనెరుగుదును" (యిర్మియా 10 : 23). మనకు సరియైన నడిపింపు అవసరము; లేదా ప్రమాదము మనకొరకు కనిపెట్టుకొని యుండును.

గొఱ్ఱెలకు మంచి కాపరి ఎటువంటివాడో మనకు క్రీస్తును అట్లే. ఆయన మన నాయకుడు, మార్గదర్శి, సంఘమునకు ఆయనే శిరస్సు (ఎఫెసీ 5 : 23). మనలను మహిమకు నడిపించు రక్షణకర్త (హెబ్రీ 2:10). ఆయనే మనకు జ్ఞానమును, నీతియు, పరిశుద్ధతయు, విమోచనము నాయెను (1 కొరింథీ 1 : 30). గనుక మన విశ్వాసమునకు కర్తయు దాని కొనసాగించువాడునైన యేసువైపు చూచుచు మనము నడచు కొందము (హెబ్రీ 12:2). యేసు మన నాయకుడై యుండగా మన జీవనయాత్రను క్షేమముగా కొనసాగించగలము. యేసుమాటలు విన కుండా ఆయనను వెంబడించలేము. మనం ఆయన మాటలకు లోబడు టలో ఆయనను విందుము.

మన గమనమువైపు ఎట్లు ప్రయాణించాలో ఎరుగనందున మనకు నిరుత్సాహము కలుగవచ్చును. అయితే సర్వజ్ఞానియైన దేవుని కుమారుడే మన మార్గదర్శిగా యున్నాడను సంగతిని బట్టి మనం ఆయనకు మరింత సన్నిహితులము కాగలము. మన సమస్త అవస రములను సర్వజ్ఞానియు, సర్వశక్తిమంతుడునైన క్రీస్తు తీర్చును.

## క్రీస్తు సంఘమును ప్రేమించుచున్నాడు

మూడవదిగా, ఈ వర్ణన క్రీస్తును సంఘమును ప్రేమించి దాని కొరకు తన ప్రాణము నర్పించు మంచి కాపరివలె చిత్రీకరించు చున్నది. ఆయన గొఱ్ఱెలకొరకు ఆసక్తిగలవాడై వాటిని రక్షించుటకు తన ప్రాణమును సయితము నర్పించును. యేసు ఇట్లు చెప్పెను : "నేను గొఱ్ఱెలకు మంచి కాపరిని; మంచి కాపరి గొఱ్ఱెలకొరకు తన ప్రాణము పెట్టును. జీతగాడు గొఱ్ఱెలకాపరి కాడు గనుక గొఱ్ఱెలు తనవి కానందున తోడేలు వచ్చుట చూచి గొఱ్ఱెలను విడిచిపెట్టి పారిపోవును; తోడేలు ఆ గొఱ్ఱెలను పట్టి చెదరగొట్టును. జీతగాడు జీతగాడే గనుక గొఱ్ఱెలను గూర్చి లక్ష్యము చేయక పారిపోవును—

నేను గొర్రెల మంచి కాపరిని. తండ్రి నన్ను ఏలాగున ఎరుగునో నేను తండ్రిని ఏలాగు ఎరుగుదునో ఆలాగే నేను నా గొర్రెలను ఎరుగుదును. నా గొర్రెలు నన్ను ఎరుగును. మరియు గొర్రెలకొరకు నా ప్రాణము పెట్టుచున్నాను" (యోహాను 10:11-15).

రెండు రకములైన కాపరుల మధ్య తారతమ్యమును మనము చూడగలము. మొదటిగా ఆయన జీతగాడు కాదు. జీతగాడు అతని జీతముకొరకే పనిచేయును. జీతగాడు కూలికి కుదిరినవాడు, అతడు దుష్టుడు కాకపోయినను, గొర్రెలను గూర్చి యజమానికి ఉన్నంత ఆసక్తి అతనికి ఉండదు, అతని విధి పూర్తి కాగానే గొర్రెలను గూర్చిన ఆశక్తి అతనికేమియు ఉండదు. రెండవదిగా యేసుప్రభువు నమ్మదగని కాపరులవంటివాడు కాడు. అట్టివారు కేవలం స్వార్థపరులు. నమ్మదగని దేవుని కాపరులను గూర్చి యెహెజ్కేలు ఇట్లు వ్రాసాడు: "వారు క్రొవ్విన గొర్రెలను వధించి క్రొవ్వును తిని బొచ్చును కప్పుకొందురు గాని గొర్రెలను మేపరు. బలహీనమైన వాటిని మీరు బల పరచరు, రోగముగల వాటిని స్వస్థపరచరు, గాయపడిన వాటికి కట్టు కట్టరు, తోలివేసినవాటిని మరల తోలుకొనిరారు, తప్పిపోయిన వాటిని వెదకరు. అదిమాత్రమే గాక మీరు కఠిన మనస్కులై బలాత్కార ముతో వాటిని ఏలుదురు. కాబట్టి కాపరులు లేకయే అవి చెదరిపోయి సకల అడవి మృగములకు ఆహారము ఆయెను. నా గొర్రెలు పర్వతములన్నిటిమీదను, ఎత్తయిన ప్రతి కొండమీదను తిరుగులాడు చున్నవి. నా గొర్రెలు భూమి యందంతట చెదరిపోయినను వాటిని గూర్చి విచారించు వాడొకడును లేడు, వెదకు వాడొకడును లేడు" (యెహెజ్కేలు 34:3-6).

ఇవ్విధమైన కాపరులనుండి యేసు వేరైనవాడు; ఆయన మంచి కాపరి, పరిచర్య చేయుటకు ఆయన జీతము పుచ్చుకొనడు గాని

ఆయన గొర్రెలను ప్రేమించినందువలన వాటికొరకు తన ప్రాణాన్ని క్రియధనముగా నిచ్చాడు. వాటి భద్రతకొరకు ఆయన తన రక్తాన్ని మూల్యంగా చెల్లించాడు. ప్రమాదము సంభవించునప్పుడు, సింహము గాని, తోడేలు గాని వచ్చినప్పుడు తన ప్రాణాన్ని కాపాడుకొనుటకు ఆయన దాగియుండడు. గొర్రెలయొక్క జీవాన్ని భద్రతను తన ప్రాణంకంటె ఎక్కువగా ఆయన ఎంచును.

గొర్రెలతో యేసుకున్న సంబంధము చాల సన్నిహితమైనది. అది తండ్రితో ఆయనకు గల సంబంధము వంటిది. అది చాల దగ్గర సంబంధము, ఒండొరుల నెరిగినట్టిది, ప్రేమించునట్టిది. యోహాను 10:14, 15లో ఎరుగును, ఎరుగుదును అను మాటలు నాలుగుసార్లు వినియోగింపబడినవి. ఆయన తన గొర్రెలను వ్యక్తిగతముగా ఎరుగును. ప్రతి దానిని ఆయన కాపాడును, సంరక్షించును, ఆపదలనుండి రక్షించును. "తన స్నేహితుల కొరకు తన ప్రాణము పెట్టువారికంటె ఎక్కువైన ప్రేమగల వాడెవడును లేడు" (యోహాను 15:13). ఇతరులు జీవించునట్లు వారికొరకు ప్రాణము పెట్టుటకంటే గొప్ప ప్రేమ మరొకటి లేదు. మన కాపరికి ఇటువంటి ప్రేమ కలదు. అది అతి లోతైనది, మరణముకంటె బలమైనది, గొర్రెలకొరకు ఆయన తన ప్రాణమును పెట్టెను (ఎఫెసీ 5:25),

మొదటి శతాబ్దపు ఆఖరి దశలో యోహాను సువార్త వ్రాయబడెను. బహుశ అది క్రీ॥శ 85-95 మధ్య వ్రాయబడెను. గనుక ఆ సువార్తను చదివిన మొదటివారు యేసు గొర్రెల కొరకు తన ప్రాణమును పెట్టుదునని చెప్పెననియు, నిజానికి వాటికొరకు ఆయన తన ప్రాణమును పెట్టెననియు ఎరుగుదురు. సంఘముకొరకు ఆయన తన ప్రాణము పెట్టుటలో అతి శ్రేష్ఠమైన ప్రేమను వ్యక్తపర్చెను. "ఏలయనగా శత్రువులమై యుండగా ఆయన కుమారుని మరణముద్వారా

మనము దేవునితో సమాధాన పరచబడిన యెడల సమాధాన పరబడిన వారమై ఆయన జీవించుటచేత మరి నిశ్చయముగా రక్షింపబడుదుము" (రోమా 5:10). మనమాయన శత్రువులమై యుండగా మనకొరకు యేసు తన ప్రాణమును పెట్టినయెడల, ఇప్పుడు మనమాయన గొర్రెలవలె ఆయన కొరకు జీవించ యత్నించుచున్నప్పుడు మన రక్షణార్థము ఆయన మనలను మరింత ఎక్కువ ప్రేమించునుగదా?

## ముగింపు

యోహాను సువార్త 10వ అధ్యాయములో క్రీస్తు చెప్పిన వర్ణన, సంఘము క్రీస్తుయొక్క మంద యని, దానిలో ఆయనకు చెందిన గొర్రెలన్నీ యుండునని ప్రకటించుచున్నది. "ఈ దొడ్డివిగాని వేరే గొర్రెలును నాకు కలవు, వాటినికూడ నేను తోడుకొని రావలెను, అవి నా స్వరము వినును, అప్పుడు మంద ఒక్కటియు గొర్రెలకాపరి ఒక్కడును అగును" అని ఆయన చెప్పెను (యోహాను 10 : 16). ఈ వేరే గొర్రెలు, ఆయన స్వరము విని ఆయనను వెంబడించు అన్య జనులు. ఆయన ఒకే దొడ్డినిగూర్చి, ఒకే కాపరినిగూర్చి చెప్పెను. గనుక ఆ ఒకే కాపరిక్రింద ఆ ఒకే దొడ్డిలో మనం ఉన్నామా లేదా దానిలో లేము! మనము ఆయన సంఘములో అయినా యున్నాము లేదా దానికి బయట యున్నాము.

నీవు క్రీస్తు మందలో లేనియెడల నీవు ఆమందలో ప్రవేశించాలి, గాని దానికి ఒకేఒక్క ద్వారమున్నది. ఆద్వారము క్రీస్తేయని జ్ఞాపకముంచుకొనుము. ఆయన ఇట్లు చెప్పెను: "నేనే ద్వారమును;నా ద్వారా ఎవడైనను లోపల ప్రవేశించిన యెడల వాడు రక్షింపబడినవాడై లోపలికి పోవుచు బయటికి వచ్చుచు మేతమేయుచునుండును" (యోహాను 10 : 9). "నేనే మార్గమును, సత్యమును, జీవమును, నా ద్వారానే తప్ప యెవడును తండ్రియొద్దకు రాడు" (యోహాను 14:6).

మానవుడు క్రీస్తు మాటలకు లోబడినప్పుడాయన మందలో ప్రవేశించును.

మంచి కాపరియైన క్రీస్తునొద్దకు రమ్ము. ఆయన మందలో ప్రవేశించుము; ఆయనను నీ కాపరిగా చేసికొనుము. ఆయన యిచ్చు సమృద్ధియైన జీవితములో పాలు పొందుము. ఆయన మందలో నీకు రక్షణ (యోహాను 10:9), సమృద్ధియైన జీవము (యోహాను 10:10), నిర్భయ జీవితము (10:12), ప్రేమ (10:15), నడిపింపు (10:4, 5) మరియు నిత్యజీవమున్నది. క్రీస్తు మందలో గొర్రెవలె జీవించుటకంటె శ్రేష్టమైన మరొక మార్గమున్నదా?

—ఎడ్డీ క్లోర్ (TFT).

— o —

## దేవుడే ప్రతిఫలమిచ్చును

### ( God will Repay )

హెబ్రీ 10:30లో పౌలు ఇట్లు చెప్పాడు: "పగతీర్చుట నాపని, నేనే ప్రతిఫలమిత్తుననియు, ప్రభువు తన ప్రజలకు తీర్పు తీర్చును అనియు చెప్పినవానిని ఎరుగుదుము గదా". ఈ జీవితంలో మనమేమి చేసామో దానినే తిరిగి పొందునట్లు దేవుడు ఈ జీవితంలోను రాబోవు జీవితంలోను తప్పక చూస్తాడు. మనం ఏమి విత్తుదుమో దానినే పొందుదుమని మొదట గమనిద్దాం. "మోసపోకుడి, దేవుడు వెక్కిరింపబడడు; మనుష్యుడు ఏమి విత్తునో ఆ పంటనే కోయును. ఏలాగనగా తన శరీరేచ్ఛలను బట్టి విత్తువాడు తన శరీరమునుండి క్షయమను పంట కోయును. ఆత్మను బట్టి విత్తువాడు ఆత్మనుండి నిత్యజీవమను పంట కోయును" (గలతీ 6:7-8).

ప్రతివాడు ఏదో ఒకటి విత్తుచు యున్నాడు. మరియు అది శరీరేచ్ఛలను బట్టిన విత్తనమైన యెడల దాని పర్యవసనాన్ని తప్పక

కోస్తాను. రెండవదిగా, మనమేమి యిచ్చామో సరిగ్గా దానినే పొందు తాము. 2 కొరింధీ 9:6లో పౌలుఇట్లు చెప్పాడు: "కొంచెముగా విత్తువాడు కొంచెముగా పంటకోయును. సమృద్ధిగా విత్తువాడు సమృద్ధిగా పంటకోయును అని యీ విషయమై చెప్పవచ్చును". నీకున్న దానిని యితరులకు వినియోగించేవరకు ఈ లోకంలో నీకు కలిగినదంటూ ఏమీ వుండదు. నీకున్న దాన్ని దాచిపెడితే దాన్ని తప్పక పోగొట్టుకొంటావు.

మూడవదిగా నీవు యితరుల కెట్లు తీర్పు తీర్చావో అట్లే నీకును తీర్పు తీర్చబడును. మత్తయి 7:1-2లో యేసు ఇట్లు చెప్పెను: "మీరు తీర్పు తీర్చకుడి, అప్పుడు మిమ్మును గూర్చి తీర్పు తీర్చబడదు. మీరు తీర్చు తీర్పుచొప్పుననే మిమ్మునుగూర్చియు తీర్పుతీర్చబడును. మీరు కొలుచు కొలత చొప్పుననే మీకును కొలువబడును". మరల "కనికరము గలవారు ధన్యులు వారు కనికరము పొందుదురు" అనికూడ ఆయన చెప్పెను (మత్తయి 5:7). "కనికరము చూపనివాడు కనికరములేని తీర్పు పొందును; కనికరము తీర్పును మించి అతిశయపడును" అని యాకోబు హెచ్చరించాడు (యాకోబు 2:13).

చివరిగా, ఈ లోకంలో మనం క్రీస్తును ఎట్లు పరామర్శించామో అదే విధంగా ఆయన మనలను కూడ పరామర్శించును. మత్తయి 10:32లో యేసు ఇట్లు చెప్పెను: "మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొనువాడెవడో పరలోకమందున్న నా తండ్రియెదుట నేనును వానిని ఒప్పుకొందును. మనుష్యుల యెదుట ఎవడు నన్ను ఎరుగననునో వానిని పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును ఎరుగనందును".

నీవు ఈ లోకంలో జీవించుచుండగా నిత్యనిధిలో యేమేమి దాచుకొన్నావో వాటిని తిరిగి పొందు నిమిత్తము ఒకానొక దినమందు

ఆ గొప్ప యజమాని యెదుట నిలువబడబోవుచున్నావు. నీవు వేమి పొందుతావు ?

— జాన్ స్టేసీ.

—o—

## రెండు అనే అంకెయొక్క ప్రాముఖ్యత

## ( Importance of the Number Two )

మన జీవితములో ప్రతిదానికి రెండుగా ఉండటం చూస్తుంటాం. ఉదాహరణకు : ఒకటి మంచిది, ఒకటి చెడ్డది, న్యాయం-అన్యాయం, మంచి-చెడు, అవినీతి-నీతి, హింస-అహింస, క్రమము-అక్రమము. శాంతి-అశాంతి.

సృష్టి అంతటికి దేవుడు ఉన్నాడు. ఆలాగుననే దేవుడు తయారుచేసిన సృష్టిని అనగా మానవులను పాడుచెయ్యటానికి దేవుని విరోధి అయిన సాతాను కూడా ఉన్నాడు. ఇది వాస్తవం. దేవుడు ఉన్నాడు అంటే దయ్యము (సాతాను) కూడా ఉన్నాడు. ఇందులో మనం ఆశ్చర్యపడవలసిన అవసరత లేదు.

దేవుడుకూడా ప్రతిదానిని రెండుగా చేసినాడు. మొట్టమొదటి దిగా దేవుడైన యెహోవా రెండు గొప్ప జ్యోతులను అనగా పగటిని ఏలుటకు పెద్ద జ్యోతిని (సూర్యుని) రాత్రిని ఏలుటకు చిన్న జ్యోతిని (చంద్రుని) చేసెను (ఆది కా. 1:16, 17). దేవుడు మానవుని సృజించి నప్పుడు స్త్రీగాను పురుషునిగాను సృజించినాడు. బైబిలు గ్రంథములో మనం చూస్తున్నాం. 1) పాతనిబంధన 2) నూతన నిబంధన. బైబిలు గ్రంథములో రెండు మార్గములుగూర్చి వ్రాయబడినది: 1) జీవమార్గం 2) మరణ మార్గం; 1) ఇరుకు ద్వారం 2) విశాలద్వారం; 1) జీవ మార్గము 2) మరణ మార్గము — నేను మీ యెదుట పెట్టుచున్నాను (యిర్మియా 21:8).

జీవమార్గం మరణమార్గం మనయెదుట దేవుడు పెట్టియున్నాడు. జీవమార్గం మన ప్రభువు అయిన యేసుక్రీస్తు (యోహాను 14 : 6). మరణమార్గం సాతానుది. జీవమార్గంగుండా మనం ప్రయాణం చేసిన యెడల పరలోకమునకు వెళ్లుదము. ఏ మార్గంలో మనం ఉన్నామో మనలను మనమే ప్రశ్నించుకొందాము!

ఆదికాండంలో మంచిచెడ్డల వృక్ష ఫలములను మాత్రమేకాదు గాని జీవవృక్షమును కూడ ఏదేను వనములో దేవుడు ఉంచెను. కానీ ఆదాము హవ్వలు మంచి, చెడుగల వృక్షఫలమును తిని వారు దేవునికి వ్యతిరేకముగా పాపమును చేసిరి (ఆది కా. 3:5, 22). మానవునికి శరీరం ఒక భాగం అయితే రెండవది ఆత్మ. దేవుడు పై శరీరమునకు కాదుగాని, ఆత్మకు ఎక్కువ ప్రాముఖ్యత నిచ్చెను. బైబిలు రెండు రకాల మనుష్యులను గూర్చి చెప్పుచున్నది: (1) శరీరానుసారులు 2) ఆత్మానుసారులు (రోమా 8:5). శరీరానుసారులు అనగా శరీర విషయములందు, కార్యములందు మనస్సుపెట్టు వారు (గలతీ 5:19, 20). శరీరానుసారులకు ఇష్టమైనవి: జారత్వం, అపవిత్రత, కాముక త్వము, విగ్రహారాధన, అభిచారము, ద్వేషములు, కలహములు, మత్సరములు, క్రోధములు, కక్షలు, భేధములు, విమతములు, అసూయ, మత్తతలు, అల్లరితో కూడిన ఆటపాటలు. వీటిని చేయువారు శరీరానుసారులు.

**ఆత్మానుసారులు అనగా:-** ఆత్మవిషయముల యందును దేవుని కార్యములందును మనస్సునుంచువారు (గలతీ 5:22), ప్రేమ, సంతోషం, సమాధానం, దీర్ఘశాంతం, దయాళుత్వం, మంచితనం, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము వీటిని కలిగియున్న వారు. ఒక శరీరానుసారి ఆత్మానుసారిగా మారవచ్చును. ఏలాగున అనగా క్రీస్తును దేవుని కుమారుడని, రక్షకుడని నమ్మి పాపక్షమాపణ

నిమిత్తం బాప్తిస్మం తీసుకొనుటద్వారా. అట్టివానికి దేవుడు పరిశుద్ధాత్మ అను వరం ఇస్తాడని వాక్యం చెప్పుచున్నది (అపొ.కా. 2:38). క్రీస్తు ఆత్మ మనలో నివసించిన యెడల ఆత్మ స్వభావం గలవారమే గానీ శరీరానుసారులం మనంకాదు (రోమా8:9).మనం శరీరసారులంగా ఉన్నామా? ఆత్మసారులంగా ఉన్నామా? మనలను మనమే పరిశీలించుకొందాం. ఒకవేళ శరీరసారులముగా ఉంటే ఈ శరీరం నశించి కృశించిపోయి మరణించును. అప్పుడు మనం నరకంలోనికి వెళతాం. ఆత్మానుసారులంగా ఉంటే—ఆత్మయైన దేవుని ఆత్మతోను సత్యముతోను ఆరాధించడం జరుగును. మనం శరీరకముగా చనిపోయినను ఆత్మ దేవుని సన్నిధికి చేరును (ప్రసంగి 12:7).

—వి. సురేశ్ కుమార్, వేగాయమ్మపేట.

—o—

## బైబిలును అర్థము చేసికొనుటకు పది సూత్రములు

### ( Ten Simple Reasons to Understand the Bible)

(మే నెల సంచిక తరువాయి)

2. అర్థము చేసికోగలిగినదంతా ఇప్పుడు అర్థం చేసికో. మిగతా సంగతులు తరువాత అర్థమగును : బైబిలు నంతటినీ క్షుణ్ణంగా అర్థము చేసికొనుటకు కనిపెట్టుటకంటె దానిలోని సూక్ష్మ సంగతులను ఇప్పుడే మనం అర్థము చేసికోవచ్చును. పసివారికి పాలవలె బైబిలులో సూక్ష్మమైన సంగతులున్నవి. అట్లే బలవంతులకు మాంసమువలె అందులో లోతైన మర్మము లున్నవి (హెబ్రీ 5 : 12-14). మనము బైబిలు చదివేకొలది దానిలోని ప్రతి భాగము విశదమగుచుండును. అయితే దానిలోని ప్రతి సంగతీ సంపూర్ణముగ అర్థమయ్యేవరకు కనిపెట్టుటకంటే, దేవుడు మనలను చేయుమని ఆజ్ఞాపించిన వాటిని చేయుటకు మొదలుపెట్టాలి.

మార్టిన్ లూథర్ చిన్నతనంలో ఒక ఏపిల్ చెట్టుమీద కొద్ది పాటి కాయలు మాత్రమే పండ్లవడం చూచాడు. అయితే సాధ్యమైనంత ఎక్కువ ఏపిల్‌పండ్ల కొరకు అతడు చెట్టును కుదిపేవాడు, తరువాత మిగతా కాయలు పండ్లవ్వకొలది వాటిని అతడు సంపాదించుకొనేవాడు. యిదే సూత్రాన్ని అతడు తన బైబిలు పఠనమునకు వర్తింపజేసుకొన్నాడు. అతడు గ్రహించుకోగలిగినంత సాధ్యమైనంత త్వరలో గ్రహించుకొన్నాడు. తరువాత కఠినమైన సంగతులు అతనికి సులభమయ్యాయి.

బైబిలులో కొన్ని సంగతులు గ్రహించుటకు కష్టమైనవి కలవు (2 పేతురు 3:16). ఇక్కడ కొన్ని సంగతులే అని చెప్పబడెను గాని అన్ని సంగతులు కావు. అయితే కష్టమైన కొన్ని సంగతులను కొందరు తమ స్వకీయ నాశనముకొరకు అపార్థము చేసికొందురు. ఈ సంగతులను అర్థము చేసికొనలేరని అక్కడ చెప్పబడలేదు, గాని అర్థము చేసికొనుటకు కొంచెము కష్టమైనవి.

మన దేవుని యెడలను తోటి మానవులయెడలను నిర్వర్తించవలసిన విధులను గూర్చిన సంగతులు సులభమైనవి. వాటిని మనం గ్రహించుకొని దేవునికి విధేయులు కావాలి. తరువాత ఎక్కువ నేర్చుకొనవచ్చును (మత్తయి 28:19-20). అనేకులు క్రీస్తునుగూర్చి వినిన మొదటి దినమందే క్రైస్తవులైనట్లు అపొస్తలుల కార్యములు చెప్పుచున్నది. తరువాత వారు విశ్వాసములో పెరిగారు, అభివృద్ధి చెందారు. దేవుని చిత్తాన్ని తెలిసికొని దాన్ని జరిగిస్తే శాంతి సమాధానములు కలుగుతాయి.

3. బైబిలులోని 66 పుస్తకములను మనం సరిగ విభజించుచు శ్రద్ధగా చదవాలి. బైబిలులో 66 పుస్తకము లున్నను, అవి చిన్నవే. రోజుకు 1/2 గంట చొప్పున చదివితే క్రొత్త నిబంధనను 7 వారముల

లోను, బైబిలు అంతటిని 7 మాసములలోను చదివేయవచ్చును. శ్రద్ధగా చదవాలంటే ఇంకా ఎక్కువ కాలము పట్టును. ప్రాథమిక సత్యములను మనం ఇట్టే గ్రహించుకోగలము. అయితే మనం జీవించునంతకాలము నేర్చుకోదగిన గొప్ప వాస్తవములు దానిలో యున్నాయి. కీర్తనల గ్రంథకర్తవలె "నేను నీ ధర్మశాస్త్రమునందు ఆశ్చర్యమైన సంగతులను చూచునట్లు నా కన్నులు తెరువుము" అని మనము ప్రార్థించగలము (కీర్త 119:18).

2 తిమోతి 2:15లో శ్రద్ధగ పఠించే ఆవశ్యకత చూపబడింది: "దేవుని యెదుట యోగ్యునిగాను సిగ్గుపడ నక్కరలేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగ ఉపదేశించువానిగాను నిన్ను నీవే దేవునికి కనుపరచుకొనుటకు జాగ్రత్త పడుము" అని అది చెప్పుచున్నది. మనకు ఇంత తెలుసునని గొప్ప చెప్పుకొనుటకు గాక, దేవుని యెదుట యోగ్యునిగా కనబడుటకు వాక్యము పఠించాలి.

ఎవరైనను గ్రంథాలయమునకు వెళ్లి ఏదో ఒక పుస్తకము తీసికొని దాని మధ్యలో ఆరంభించడు. అయినను అనేకులు బైబిలును అట్లే చదువుతారు. ఒకడు చరిత్ర చదవాలనుకొన్నపుడు చరిత్ర గ్రంథాన్ని చదువుతాడు. గణితమునుగూర్చి చదవాలన్నపుడు ఆ గణిత గ్రంథాన్ని చదువుతాడు. మరల లెక్కలలో కూడ కఠినమైన లెక్కలకు ముందు ప్రాథమిక లెక్కలను నేర్చుకొంటాడు. బైబిలును చదివేటప్పుడు మనముకూడ ఆదేరకమైన తెలివిని ఉపయోగించాలి. బైబిలులోని పుస్తకాలలో చట్టము, చరిత్ర, పద్యకావ్యములు, ప్రవచనములు, జీవిత చరిత్రలు మొదలగునవి యున్నవి. మనము దేనిని గూర్చి తెలిసికొనగోరుచున్నామో ఆ భాగాన్ని బైబిలులో చదవాలి. దేవుడు మూడు వివిధ కాలాల్లో వివిధ మతవిధానాల నిచ్చినందున, బైబిలును చదువునప్పుడు ఆ సంఘటన ఏ కాలములోనిదో గమనించుము.

బైబిలులో రికార్డు చేయబడిన మూడు వివిధ యుగము లేమనగా :

**1. పితరుల యుగము :** ఆదామునుండి మోషేవరకు గల ప్రథమ యుగములో దేవుడు లిఖితపూర్వక చట్టము నియ్యలేదు. అది ఇంచుమించు 2500 సంవత్సరము లుండెను. ఆయన అబ్రహాము లాంటి గోత్రకర్తకు తన చిత్తమును తెలియజేయగా అతడు దానిని తన కుటుంబానికి లేక గోత్రానికే తెలియజేసేవాడు. (ఆదికాండము 18:18-19 చదువుము). ఆదికాండము మొదటి అధ్యాయము నుండి నిర్గమ కాండము 20వ అధ్యాయమువరకు గల ప్రజలందరు పితరుల యుగములో జీవించినవారే.

**2. మోషే యుగము (లేదా) యూదుల యుగము :** తరువాత 1500 సంవత్సరముల మట్టుకు దేవుడు ప్రత్యేక ప్రజలకు ప్రత్యేకచట్టము (ధర్మశాస్త్రము) నిచ్చెను. వారు ఇశ్రాయేలీయులు. క్రీస్తు ఆ జనాంగమునుండి ఉద్భవించు నిమిత్తము దేవుడు వారిని తన కొరకు ప్రత్యేకముగా ఏర్పరచుకొనెను. క్రీస్తు వచ్చువరకు ఇశ్రాయేలీయులకు దేవుడు పాతనిబంధన ననుగ్రహించెను (గలతీ 3 : 19; యోహా 1 : 17). దానిని ఆయన మోషే ద్వారా అనుగ్రహించెను. అందువలన ఆ కాలమును మోషే యుగమని, లేదా యూదుల యుగమని పిలువబడుట జరిగింది. మరియు ఆ ధర్మశాస్త్రము ఇశ్రాయేలీయులకే తప్ప మరెవరికిని ఇయ్యబడలేదు (ద్వితీ 5:1-3; నిర్గమ 19 : 6; మరియు నిర్గమ 20 అధ్యా). పాతనిబంధలోనివి యూదుల మతాచారములే గాని క్రైస్తవ్యము కాదని గుర్తించుకొనుము.

**3. క్రైస్తవ యుగము :** క్రీస్తు సిలువమీద చనిపోయినప్పటినుండి క్రైస్తవ జీవనవిధానము అమలులోనికి వచ్చినది (హెబ్రీ 9:16, 17). క్రీస్తు మరల వచ్చువరకు అది కొనసాగును. నేడున్న మానవు లందరికీ క్రొత్తనిబంధన వర్తించును. క్రీస్తు ఈ లోకమునకు

వచ్చిననాటినుండి ఏదైనా ప్రత్యేక ప్రజలకు దేవుడొక ప్రత్యేక చట్టము నీయలేదు. అందరును క్రొత్తనిబంధనను బట్టియే నడుచుకోవలెను. గనుక బైబిలును చదువునప్పుడు ఏ కాలములో జరిగిన సంఘటనను చదువుచున్నావో గమనించుకొనుట ముఖ్యము. (సశేషం)

—చార్ల్స్ F. స్కాట్.

— o —

## ఆశ్చర్యకరమైన దేవుని సంఘం

## ( God's Amazing Church )

దేవుడు ఆశ్చర్యకరుడు. ఆయన కుమారుడైన క్రీస్తు ఆశ్చర్యకరుడు. యేసుక్రీస్తు స్థాపించిన సంఘము ఆశ్చర్యకరమైనది. క్రీస్తు తన స్వంత రక్తాన్ని యిచ్చి స్థాపించిన సంఘముకంటే శ్రేష్టమైన, ఉన్నతమైన సంస్థ మరియొకటి లేదు.

క్రీస్తు సంఘాన్ని దేవుడే సంకల్పించాడు; దానిని రూపించినవాడు కూడ దేవుడే. "దేవుడు మన ప్రభువైన క్రీస్తు యేసునందు చేసిన నిత్య సంకల్పము చొప్పున పరలోకములో ప్రధానులకును అధికారులకును సంఘముద్వారా తనయొక్క నానావిధమైన జ్ఞానము ఇప్పుడు తెలియబడవలెనని ఉద్దేశించి"నట్లు పౌలు ఎఫెసీ 3:8-11లో చెప్పియున్నాడు. "ఎట్లనగా తన ప్రియుని యందు తాను ఉచితముగా మన కనుగ్రహించిన తన కృపా మహిమకు కీర్తి కలుగునట్లు తన చిత్తప్రకారమైన దయాసంకల్పము చొప్పున యేసుక్రీస్తుద్వారా తనకు కుమారులనుగా స్వీకరించుటకై మనలను ముందుగా తన కోసము నిర్ణయించుకొని, మనము తన యెదుట పరిశుద్ధులమును, నిర్దోషులమునై యుండవలెనని జగత్తు పునాది వేయబడకమునుపే ప్రేమచేత ఆయన క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెనని" పౌలు ఎఫెసులోని క్రీస్తు సంఘమునకు జ్ఞాపకము చేసియున్నాడు (ఎఫెసీ 1:4-7).

జగత్తు పునాది వేయబడకమునుపే దేవుడు తన సంఘాన్ని సంకల్పించినను, అది యేసుక్రీస్తు స్వరక్తముద్వారా కొనబడినది. అందుకే ఎఫెసులోని సంఘ పెద్దలను పౌలు ఇట్లు హెచ్చరించాడు: "దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన తన సంఘమును కాయుటకు పరిశుద్ధాత్మ మిమ్మును దేనియందు అధ్యక్షులనుగా యుంచెనో ఆ యావత్తు మందను గూర్చియు, మీమట్టుకు మిమ్మును గూర్చియు జాగ్రత్తగా యుండుడి" (అపొ.కా. 20:28).

## పరలోక గమ్యము

క్రీస్తు స్థాపించిన సంఘ గమ్యము - పరలోకము. క్రీస్తు మరల వచ్చినప్పుడు ఆయన సంఘాన్నే తనతో యుండుటకు కొనిపోతాడు. యిది ఆశ్చర్యము. "ఆర్భాటముతోను, ప్రధానదూత శబ్దముతోను, దేవుని బూరతోను, పరలోకమునుండి ప్రభువు దిగివచ్చును; క్రీస్తు నందుండి మృతులైనవారు మొదట లేతురు. ఆ మీదట సజీవులమై నిలిచియుండు మనము వారితోకూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశ మండలమునకు మేఘములమీద కొనిపోబడుదుము. కాగా మనము సదాకాలము ప్రభువుతో కూడ ఉందుము. కాబట్టి మీరు ఈ మాటలచేత ఒకనినొకడు ఆదరించుకొనుడి" యని థెస్స లోనికయలోని క్రీస్తు సంఘాన్ని అపొ.పౌలు హెచ్చరించాడు (1 థెస్స 4:16-18).

ఆశ్చర్యకరమైన ఈసంఘానికి శిరస్సు క్రీస్తే. "మరియు సమస్త మును ఆయన పాదముల క్రింద ఉంచి సమస్తముపైని ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను. ఆ సంఘము ఆయన శరీరము; సమస్తమును పూర్తిగా నింపుచున్నవాని సంపూర్ణతయై యున్నది" (ఎఫెసీ 1 : 22, 23). క్రీస్తు సంఘమునకు శిరస్సై యుండగా, బైబిలు దానికి మార్గదర్శియై యున్నది. "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి

సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పుదిద్దుటకును నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది" (2 తిమో 3:16,17). క్రీస్తు సంఘముయొక్క ఆరాధనా మూర్తి దేవుడే. "మనలో కార్యసాధకమైన తన శక్తి చొప్పున మనము అడుగువాటన్నిటి కంటెను, ఊహించు వాటన్నిటి కంటెను అత్యధికముగా చేయ శక్తిగల దేవునికి క్రీస్తు యేసుమూలముగా సంఘములో తరతరములు సదాకాలము మహిమ కలుగును గాక, ఆమెన్" (ఎఫెసీ 3:20, 21).

## సువార్త సంఘము

క్రీస్తు స్థాపించిన సంఘము సువార్త సంఘము (1 కొరింథీ 15:1-4). దేవునికి విధేయత చూపించు సంఘము (అపొ.కా. 2:42), ప్రార్థించు సంఘము (1 థెస్స 5 : 17), ఏకమైయున్న సంఘము, విజయము సాధించు సంఘము. పాతాళలోక ద్వారములు దానియెదుట నిలువనేరవు (మత్తయి 16:18). దేవుని సంఘముయొక్క మహిమను మనం అభివృద్ధి చేయలేము. స్త్రీ పురుషు లందరు ఈ ఆశ్చర్యకరమైన సంఘములో సభ్యులు కావచ్చును.

ఆటు తరువాత, దేవుడు మనయెడల చూపు కృప ఆశ్చర్యమైనది. దేవుని కృపయే మానవుల రక్షణకున్న గొప్ప స్థావరము ఎఫెసీ 2 : 8, 9లో అపొ. పౌలు యిట్లు చెప్పుచున్నాడు: "మీరు విశ్వాసముద్వారా కృపచేతనే రక్షింపబడియున్నారు. ఇది మీ వలన కలిగినదికాదు. దేవుని వరమే. అది క్రియలవలన కలిగినది కాదు గనుక ఎవడును అతిశయపడ వీలులేదు". పాపమువలన మానవజాతి నిత్యనరకానికి పోవుచుంటే, దేవుడే తన కుమారుని మానవావతారిగ పంపించి, మన పాప పరిహారార్థబలిగా అర్పించాడు. "అయితే దేవుడు

మనయెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు. ఎట్లనగా మ
మింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను
(రోమా 5:8). యిది మానవుల యెడల దేవుడు కనుపరచిన ఆశ్చర్య
కరమైన కృప.

దేవుని కృపకు మానవుడు పాత్రుడు కాకపోయినను, దేవుడు ఉచితముగా యిచ్చు రక్షణను మానవుడు అంగీకరింప వచ్చును, అంగీకరించవలెను. కొరింథులోని ప్రజలు అవాంఛనీయమైన వాటిని జరిగించుచున్నను ప్రభువైన యేసుక్రీస్తు నామమున దేవుని ఆత్మయందు వారు కడుగబడి పరిశుద్ధపరచబడి దేవుని కృపవలన నీతిమంతులుగా తీర్చబడిరి (1 కొరింథీ 6:9-11). వారు మొదట దేవుని వాక్యమును విని, విశ్వసించి, తమ పాపముల విషయమై మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిరి (అపొ.కా. 18:8). దేవుని కృపతో నిండియున్న సంఘముతో చేర్చబడిరి. విరిగి నలిగిన హృదయంతో మీరు దేవునియొద్దకు రండి, అప్పుడాయన మీయొద్దకు వచ్చును.

— జాషువా గూటం

—o—


తెలుగు, ఇంగ్లీషు, ఒరియా భాషలలో ఇప్పుడు ఉచిత బైబిలు కరస్పాండెన్సు కోర్సు మావద్ద లభ్యమగుచున్నది. వలయువారు ఈ దిగువ చిరునామాకు వ్రాయండి:

**DIRECTOR**

**Bible Correspondence Course**

**P.O. Box No. 80, KAKINADA - 533 001.**

[ట్రైటిలు రెండవ పేజీ తరువాయి]

జరిగించుట కాయన అట్లు గావించెను. బాప్తిస్మ మనగా నీటిలో ముంచడము. గాన చిలకరింపు, కుమ్మరింపు మొదలగునవి బాప్తిస్మము కానేరవు. క్రీస్తు యేసునందు విశ్వాసియైనవాడు, తన పాపముల విషయమై మారుమనస్సు పొందినవాడు, క్రీస్తునందలి విశ్వాసమును బహిరంగముగా ఒప్పుకొనినవాడు బాప్తిస్మము పొందవలెను. గనుక పసిబిడ్డల బాప్తిస్మముకూడ వాక్య విరుద్ధం. సువార్తను నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడునని యేసుప్రభువు చెప్పిన మాటలో ఒకడు రక్షింపబడవలెనంటే బాప్తిస్మము పొందవలెనని గ్రహింపగు చున్నది. పాపక్షమాపణ, రక్షణ, విమోచన మొదలగునవి బాప్తిస్మము పొందినప్పుడే గాని అంతకుముందు జరుగవు. లక్ష్మీపోలవరం సంఘము, సోదరులు జి. ఇమ్మానుయేలు, జి. ఇశ్రాయేలుగార్లు చక్కటి ఆతిథ్యమిచ్చి సదస్సును జయప్రదం చేసిరి. సోదరులు బుర్రే యోహానుగారి ప్రార్థనతో సదస్సు ముగిసెను.

జూన్ 27వ తేదీ మంగళవారంనాడు కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ వేసవి సెలవల అనంతరం తెరువబడెను. క్రొత్తవారికి ప్రస్తుతం అడ్మిషన్లు జరుగుచున్నవి.

జూన్ 7, 8, 9 తేదీలలో ర్యాలి గ్రామంలో 19వ వార్షిక సువార్త కూటములు జరిగెను. ప్రతి కూటమునకు ఇంచుమించు మూడు వందల మంది హాజరైరి. సోదరులు పాల్ గూటం, యన్.జె. మోహనరావ్, యన్. విలియం, M. పాల్ నెహ్రూ, దీనదయాళ్ బిషప్, పి.యస్.ఆర్. జై పాల్‌గార్లు వాక్యపరిచర్య చేయగా 13 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. జూన్ 25వ తేదీ ఆదివారం అమెరికాలో Branson క్రీస్తు సంఘమునుండి వచ్చిన Damon Vincent గారు ర్యాలి క్రీస్తు సంఘమును దర్శించి వాక్యపరిచర్య చేసిరి. 5గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. ర్యాలిలో సోదరులు పి.యస్.ఆర్. జై పాల్‌గారు క్రీస్తుకొరకు మంచి పని చేయుచున్నారు.

— ० —

# క్రైస్తవ కీర్తనలు

286 పాటలు గల క్రైస్తవ కీర్తనల పుస్తకం మరల ముద్రింపబడినది. దానిలో అనేక క్రొత్త పాటలు, సత్యవాణిలో ప్రసారము చేయబడుచున్న పాటలు చేర్చబడినవి. ఒక్కొక్క కాపీ వెల రూ॥ 12/- మాత్రమే. పోస్టేజీ ఇంకొక రెండు రూపాయలు. వలయువారు ఈ దిగువ చిరునామాకు రూ॥ 14/- లు M O. చేసి పొందండి :

**SATYAVANI,**
**Samba Murthy Street,**
**Kakinada - 533 004**

Regd. No. R/KD—45/KD H.O.
Date of Posting : 15th of Every month

From
SATYA WAKKU
P.O. Box 80
KAKINADA 533 001

No.

To